సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

91829 05602 నంబర్‌లో సంప్రదించండి

విజ్ఞాన భాండాగారం.. మురళీనగర్ గ్రంథాలయం



మురళీనగర్ గ్రంథాలయంలో అందుబాటులో పుస్తకాలు



పెయింటింగ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

- పుస్తక పఠనం, శిక్షణ కార్యక్రమాలకు వేదిక
- విద్యార్థులు, ఉద్యోగార్థులకు వరం
- అనేక మందికి ఉన్నత స్థాయి ఉద్యోగులు

మురళీనగర్: పేదలకు విజ్ఞానాన్ని అందించే పెన్నిధిగా గ్రంథాలయాలను చెప్పుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక పుస్తకం కొనాలంటే కనీసం వంద రూపాయలు అవసరమవుతుంది. ఈ తరుణంలో ఉన్నత ఉద్యోగాలు సాధించాలనుకునే వారికి గ్రంథాలయం ఒక్కటే వారి ముందున్న మార్గం. పైసా ఖర్చు లేకుండా తమకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను చదువుకునే వీలు కల్పిస్తుంది. ఇదొక పుస్తక భాండాగారం. పేదల ముంగిటకు పుస్తకాలను అందించే గొప్ప అక్షయపాత్రని పేర్కొనవచ్చు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న శాఖా గ్రంథాలయాలు వాటి పరసర ప్రాంతాలకు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. మురళీనగర్‌లో ప్రత్యేకంగా కేవలం మహిళలు, పిల్లల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఉదయం 8–11 గంటలు, సాయంత్రం 4–7 గంటల వరకు ఈ లైబ్రరీ అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవుల్లో మాత్రం పనిచేయదు. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటే విజ్ఞాన ఖనిగా తయారు కావచ్చు.

1987లో ఏర్పాటు

ఏపీటీఎఫ్ ఉద్యమ నేత గుల్లిపల్లి సింహాద్రప్పడు కృషితో 1987లో మురళీనగర్‌లో మహిళలు, పిల్లల గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 2012లో నగర పాలక సంస్థ దీనికి పూర్తి స్థాయి భవనాన్ని కేటాయించింది. కేవలం మహిళలకు మాత్రమే కాకుండా ఇతర పాఠకులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన పుస్తకాలతోపాటు అన్ని సదుపాయాలు కల్పించారు.

అందుబాటులో అనేక పుస్తకాలు

▲ ఈ గ్రంథాలయంలో మొత్తం అన్ని రకాల పుస్తకాలు కలిపి 14,765 ఉండగా.. వీటిలో ప్రత్యేకించి పిల్లల కోసం 3,200 ఉన్నాయి.

▲ రిఫరెన్స్ బుక్స్ 4,894, సాహిత్యపరమైన పుస్తకాలు 384, టెక్ట్స్ బుక్స్ 384, పీరియాడికల్స్ 3,025, ఫిక్షన్ బుక్స్ 1,281, నాన్ ఫిక్షన్ బుక్స్ 1,631 అందుబాటులో ఉంచారు.

▲ భాషల వారీగా పరిశీలిస్తే తెలుగు పుస్తకాలు 11,537, ఇంగ్లిష్ బుక్స్ 2,252, హిందీ పుస్తకాలు 926, ఉర్దూ పుస్తకాలు 43, ఇతర పుస్తకాలు 7 ఉన్నాయి.

సభ్యుల వివరాలు

ఈ గ్రంథాలయంలో మొత్తం 2,605 సభ్యులు ఉన్నారు. వీరిలో 1,269 మహిళలు, 544 మంది పిల్లలు. వీరికి అవసరమైన పుస్తకాలన్నీ అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. లైబ్రరీకి వచ్చి చదవడం లేదా పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకునే సదుపాయం కూడా ఉంది. ఇక్కడి గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా అనేక మంది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు.

విజ్ఞానం పెంచేలా కార్యక్రమాలు



మురళీనగర్ గ్రంథాలయానికి వచ్చే ప్రతి పాఠకుడికి అవసరమైన పుస్తకాలు, గ్రంథాలను అందుబాటులో ఉంచాం. పిల్లల్లో పుస్తక పఠనానికి అధిక ప్రాధాన్యమిచ్చి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీడర్ డిమాండ్‌ను బట్టి పుస్తకాలు సిద్ధం చేశాం. మహిళలు, పిల్లల విజ్ఞానం పెంచేలా సందర్భానుసారంగా కార్యక్రమాలు నిర్వహించి గ్రంథాలయంలో పఠనంపై ఆసక్తి కలిగిస్తున్నాం

– వై.పద్మజ, గ్రంథాలయాధికారి

రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తుల నివాళి



అక్కయ్యపాలెంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సమయం హేమంత్‌కుమార్, విద్యార్థులు

సీతంపేట: ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం కూడలిలో ఒడిశా రైలు ప్రమాదం ఘటనలో మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన రాష్ట్ర ప్రజలకు కేంద్ర సహాయ నిధితోపాటు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భారీ గాయాలు, అవయవాలు కోల్పోయిన వారి కుటుంబాలను జీవితాంతం ఆదుకునేలా కుటుంబ సభ్యులకు రైల్వేలో ఉద్యోగం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల న్యాయవాది పలకా శ్రీరామమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊహకందని విషాదంలోనూ పరిమళించిన మానవత్వం

తాటిచెట్లపాలెం: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం ఊహకందనిదని, ఆ సమయంలోనూ మానవత్వం పరిమళించిందని ఈస్ట్ కోస్ట్ రైల్వే, డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) మెంబర్ యర్రం వెంకటరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ప్రమాదానికి కొన్ని గంటల ముందు ఈ మార్గంలో ప్రయాణించే రైల్లోనే తాను ప్రయాణించినట్లు తెలిపారు. వందల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడటం ఎంతో బాధకరమైన విషయమని, ఇలాంటి పరిస్థితుల్లో స్థానికులు చాలా సహాయ పడి, రక్తదానం చేసేందుకు ముందుకొచ్చి మానవత్వం చాటుకున్నారని అభినందించారు. ఇదే సమయంలో రైల్వే అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ చర్యల్లో పాల్గొని నిరంతరాయంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

విజయవంతంగా సాయినాథుడి నామజపం



మురళీనగర్ ఆలయంలో సాయినాథుడికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలో కొలువైన షిర్డీసాయినాథుని సన్నిధిలో శనివారం రాత్రి నుంచి నిర్వహిస్తున్న ఏకాహం కార్యక్రమం ఆదివారం ఉదయం 6 గంటలకు ముగిసింది. రామాలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. గురు పౌర్ణమి రోజున నిర్వహించనున్న పూజా కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేయడానికి సాయినాథుడి కృప కోసం ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి అనే నామాన్ని 12 గంటల పాటు జపించారు. ఏకాహం ముగింపు సందర్భంగా షిర్డీసాయిబాబాకు అర్చకులు, నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి పెంటకోట శ్రీనివాసరావు, అర్చకులు, రామశాస్త్రి, భానుమూర్తి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉమానీలకంఠేశ్వరాలయంలో భారీ అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో శేఖర్‌బాబు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్‌బాబు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో చైర్మన్ అప్పలరెడ్డి, అర్చకులు రామారావు శర్మ, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

'తిల్లానాలు'పై సంగీత శిక్షణ



వంకాయల వెంకటరమణమూర్తిని సత్కరిస్తున్న మండపాక శారద

సీతంపేట: పద్మ విభూషణ్, సంగీత కళానిధి డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచించిన తిల్లానాలుపై విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంగీత శిక్షణ శిబిరం జరిగింది. అహిర్ భైరవి, కుంత వరాళి, కదన కుతూహలం, బేహాగ్ రాగాల్లో తిల్లానాలు నేర్పారు. మృదంగ విద్వాంసుడు వంకాయల వెంకటరమణమూర్తికి బెనారస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా అకాడమీ తరఫున ఆయనను శారద సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవాధ్యక్షుడు ఎం.ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నాగలక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్వారకా స్టేషన్‌లో ఎస్‌ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ రౌడీ షీటర్లకు పలు సూచనలిచ్చారు. సత్ప్రవర్తనతో ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం షాపుల వద్ద చేరి గొడవలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద పోలీసులు, సిబ్బంది అప్పగించారు.

దివ్యాంగ వ్యక్తి అదృశ్యం



అప్పలరాజు

సీతమ్మధార: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి ఐదు రోజులుగా తిరిగి రాకపోవడంతో అతడి సోదరి అనూషా ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ ధరేంద్ర కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట కనకమ్మ వారి వీధికి చెందిన జి.అప్పలరాజు (దివ్యాంగుడు) ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇంటికి వెళ్లి వెదికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం అప్పలరాజు సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు ఎక్కడైనా కనిపిస్తే 63051 87009, 85558 13894 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ ధర్మేంద్ర కోరారు.

ఘనంగా భీమ్‌సేన యువ సమ్మేళనం



యువ సమ్మేళనంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల కార్యవర్గ సభ్యులు

సీతంపేట: భీమ్‌సేన ఉత్తరాంధ్ర యువ సమ్మేళనం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. భీమ్‌సేన వ్యవస్థాపకుడు రవిసిద్ధార్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాల భీమ్‌సేన కార్యవర్గ సభ్యులు 500 మంది హాజరయ్యారు. ముఖ్య అతిథి ఏడీసీపీ క్రైమ్స్(విశాఖపట్నం) డి.గంగాధరమ్ మాట్లాడుతూ పల్లెల్లో చదువుకు ప్రాధాన్యమివ్వాలని, గ్రామాలు విడిచి విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించాలన్నారు. డీఎస్పీ కాళిదాస్ మాట్లాడుతూ యువత కోసం భీమ్‌సేన సంస్థను స్థాపించి రవి సిద్ధార్థ ఎంతో శ్రమిస్తున్నారని, ఆయనకు అందరూ సహకారం అందించాలని కోరారు. సామాజిక ఉద్యమకారుడు కొరివి విజయకుమార్ మాట్లాడుతూ భీమ్‌సేన ఉత్తరాంధ్రలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, విశాఖపట్నం జిల్లాల భీమ్ సేన ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులు, మొక్కల పంపిణీ నేడు

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వాకర్స్ పార్కులో వస్త్ర సంచులు, మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6.30 గంటలకు మట్టి కుండీలతో మొక్కలు అందిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ పరిధిలోని న్యూకోచింగ్ కాంప్లెక్స్ దగ్గరలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు సూచనల మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి గుర్తుతెలియని రైలు నుంచి జారిపడడం వల్ల గానీ, లేదా ట్రాక్ దాటే సమయంలో రైలు ఢీకొట్టడం వల్ల గానీ మరణించి ఉండొచ్చు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి వైట్ అండ్ ఆరెంజ్ కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని, టీ షర్ట్ వెనుక విహాస్ స్ప్రెడ్ ద లైట్ అనే పేర్లు ఉన్నాయని, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ వ్యక్తి గురించి సమాచారం తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

దశ మహావిద్యలపై అనుగ్రహ భాషణం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద మహాస్వామి



కార్యక్రమానికి హాజరైన భక్తులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శ్రీ దశ మహావిద్యలపై అనుగ్రహ భాషణ కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి తొలి రోజు దశ విద్యలో దేవతైన లలితాదేవి గురించి అనుగ్రణ భాషణం చేశారు. లలితాదేవి విశిష్టతను, వైభవాన్ని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి ప్రవచనాలు శ్రద్ధగా విన్నారు. ఈ నెల 8 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామి వారి అనుగ్రహ భాషణం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కోరారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్ పర్యవేక్షించారు.

మొక్కల పెంపకంపై అవగాహన



పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు, పిల్లలు

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం మొక్కలు నాటడం, పెంచడంపై ఈస్ట్ పార్కులో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నెలవారీ సమావేశం ఏర్పాటు చేసి రానున్న నెలలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 50 మంది మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వందన పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సిటీ టెర్రస్ గార్డెన్ సంస్థ ప్రతినిధులు ఆరవల అరుణ, మళ్ల సరిత, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు మాధవి, ఎం.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, లీలా నాయుడు డైరెక్టర్లు ఎం.మహాలక్ష్మి, జి.మహాలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ఎ.జయశ్రీ, కృష్ణవేణి, చిన్నారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గత నెల 24న అరుణ్‌జ్యోతి నగర్‌కు చెందిన ప్రసాద్ స్కూటీపై కంచరపాలెం నుంచి జ్ఞానాపురం వైపు వెళ్తుండగా అక్కడి ఆర్చి వద్దకు వచ్చేసరికి చావులమదం నుంచి కంచరపాలెం వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ప్రసాద్‌కు గాయాలవడంతో అతడిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. శనివారం రాత్రి ప్రసాద్ తల్లి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రెడ్డి రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

● కంచరపాలెం పరిధిలో ఓ మహిళకు గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సరోజిని అనే మహిళ శనివారం మురళీనగర్ వర్మా కాంప్లెక్స్ జంక్షన్ మీదుగా మాధవధార వెళ్తున్న క్రమంలో ఆర్సీఎం చర్చి వద్దకు వచ్చేసరికి అదే దారిలో స్కూటీపై వ్యక్తి వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె కిందపడిపోయారు. ఎడమకాలికి, చేతికి గాయాలయ్యాయి. దీంతో శనివారం రాత్రి ఐదవ పట్టణ పోలీసులకు సరోజిని ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలుకు నివాళి



ఎస్పీ బాలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు, రాజశేఖర్, కళాకారులు

మర్రిపాలెం: మెలోడి క్రియేటర్స్, కాలనీ కేర్ టీం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వన విహార్ పార్కులో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు విగ్రహానికి ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర సీమ ద్వారా తన మధుర గానంతో బాలు చేసిన గాత్ర సేవలను వీసీ రాజు కొనియాడారు. దేశం గర్వించే గొప్ప గాయకుడు కీర్తిని పొందడమే కాకుండా తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ కడలి సారథ్యం వహించిన ఈ కార్యక్రమంలో మెలోడి క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్, కొణతాల రాజు, పుండరీ కుమార్, ప్రభాకర్, మధవ్, భూపతి నాగేశ్వరరావు, ఎస్ఎస్ఎన్ రాజు, కాలనీ కేర్ టీం సభ్యులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఎస్పీబీ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో..

ఎస్పీబీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వన విహార్ పార్కులో ఎస్పీ బాలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శర్మ ఆప్టికల్స్ అద్దంకి వాసు, కబడ్డీ శ్రీను, వెంకీ, వి.శ్రీను, సాయి, శంకర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అంబికాబాగ్ రామాలయంలో వైభవంగా శ్రీపుష్పయాగం



విశేష అలంకరణలో సీతారామచంద్రస్వామి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో గత నెల 30 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున సాయంత్రం 6 గంటలకు స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు, సర్వలోప ప్రాయశ్చితం నిర్వహించారు. అనంతరం శ్రీపుష్పయాగం, పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అణగదొక్కే ప్రయత్నం మానుకోండి

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను అణగదొక్కే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 843వ రోజుకు చేరుకున్నాయి. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రం ఉపసంహరించుకున్నట్లు ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు.

స్కూల్ బస్సుల పార్కింగ్‌తో ఇక్కట్లు



రోడ్డుకు ఇరువైపులా నిలిపిన ప్రైవేట్ స్కూల్ బస్సులు

సీతమ్మధార: ఓ ప్రైవేట్ స్కూల్ బస్సులు రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణ లేవుట్‌లో ప్రైవేట్ బస్సులను ఇష్టారాజ్యంగా పార్క్‌చేసి వదిలేస్తున్నారు. రాత్రి పూట బాలయ్యశాస్త్రి లేఅవుట్ నుంచి రాధాకృష్ణ లేఅవుట్‌కు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో రోడ్ల వెంబడి సుమారు ఏడు బస్సులు నిలిపివేయడంతో స్థానికులు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ట్రాఫిక్ అధికారులు స్పందించి సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.